www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 జూన్ 2025
5
పశ్చిమ గోదావరి



25న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఈ నెల 25న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ (ఉద్యోగ దిక్సూచి) నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలోని డిజెబుల్ పీపుల్ యువతీ యువకులకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థచే ఆర్‌ఒడిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. దీనిలో సుమారు 13 ప్రముఖ కంపెనీలతోపాటు మరికొన్ని ఇతర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోకమాన్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ రూటే వేరు..!

- ఇళ్లకు కరెంటు ఆపేసి చేపల చెరువులకు సరఫరా
- చెరువులున్న గ్రామాల్లో ఐదారు గంటలు కరెంటు కోత
- నిడమర్రు మండలంలో పరిస్థితి మరింత దారుణం
- ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో నిర్లక్ష్యంతో లోఓల్టేజీతో జనం సతమతం
- నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల కనెక్షన్లపై ఫిర్యాదులొచ్చినా పట్టదు
- కొత్త విద్యుత్ సర్వీస్ కావాలంటే రూ.6,500 వసూలు



నిడమర్రు శివార్లలో కరెంటు స్థంభానికి ఏర్పాటు చేసిన ఈ రాడ్ చేపల చెరువులకోసమే అంటున్న జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

విద్యుత్ శాఖాధికారుల వ్యవహారశైలి వివాదాస్పదంగా మారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. విద్యుదవిలి కరెంటు కోతలపై జనం అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని చెబుతున్నారు. చేపల చెరువులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లోని ఇళ్లకు కరెంటు నిలిపేసి మరీ చేపల చెరువులకు కరెంటు సరఫరా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో కరెంటు కోతలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని డెల్టా మండలాల్లో పెద్దఎత్తున చేపల చెరువులు ఉన్నాయి. ఆయా మండలాల్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండటంపై జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. చేపల చెరువుల యాజమాన్యాల నుంచి పెద్దఎత్తున మామూళ్లు అందుకుని ఇళ్లకు కరెంటు కోతలు పెడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఒకపక్క ప్రభుత్వం 24 గంటలు కరెంటు సరఫరా చేస్తున్నట్లు గొప్పలు చెబుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పరిస్థితి క్షేత్రస్థాయిలో ఉంది. ముఖ్యంగా నిడమర్రు మండలంలోని విద్యుత్ శాఖ అధికారుల తీరు చర్చనీయాంశమవుతోంది. జిల్లాకు ప్రస్తుతం సరిపడా విద్యుత్ సరఫరా అవుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ గ్రామాల్లో మాత్రం తీవ్రంగా కరెంటు కోతలు విధిస్తున్నారు. నిడమర్రు మండలం ఆదవికొలను పంచాయతీలోని సత్యనారాయణపురంలోని కాలనీల్లో కరెంటు కోతలు నాలుగైదు గంటలకుపైగా సైతం విధిస్తున్నట్లు అక్కడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అనేకసార్లు జనం అధికారులకు ఫిర్యాదు చేశారు. చేపల చెరువులకు కరెంటు సరఫరా చేయడం కోసం ఇళ్లకు కోతలు పెడుతున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్యతీవ్రంగా ఉందని, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా చేయకపోవడంపై జనం గగ్గోలు పెడుతున్నారు. ఈదురు గాలులు వీస్తే కరెంటు ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గంటలు తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇళ్లల్లో ఉన్న కుటుంబాలు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులుగాని, అధికారులుగాని ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేపల చెరువులకు కరెంట్ సరఫరా చేస్తూ ఇళ్లకు కోతలు పెడుతున్న వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

చేపల చెరువులపై నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు

చేపల చెరువులకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కనెక్షన్లు నిబంధనల విరుద్ధంగా ఉన్నప్పటికీ విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. జనం నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నిడమర్రు మండలంలోని విద్యుత్ శాఖాధికారుల వ్యవహార శైలి మరింత చర్చనీయాంశంగా ఉంది. ప్రభుత్వం పదెకరాలలోపు చేపల చెరువులకు సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తోంది. కొంతమంది బడాబాబులు 50 ఎకరాలు, ఆపైబడి ఉన్న చెరువులకు ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్లను పదెకరాలలోపుగా చూపించి విద్యుత్ రాయితీ పొందుతున్నారు. అంతేకాకుండా చెరువులో భూమిలేని వ్యక్తుల పేరట అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విజిలెన్స్‌లో ఫిర్యాదులు వస్తున్నప్పటికీ తప్పుడు ఎండార్స్‌మెంట్లతో మూసివేస్తున్న పరిస్థితి ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొత్త కనెక్షన్‌కు రూ. 6,500 వసూలు

ఇంటికి కొత్త విద్యుత్ సర్వీస్ ఏర్పాటు చేసుకునేవారి నుంచి పెద్దఎత్తున మామూళ్లు వసూలు చేస్తున్న పరిస్థితి విద్యుత్‌శాఖలో ఉంది. నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ సర్వీస్‌కు రూ.3,950 చెల్లించాలి. విద్యుత్ శాఖాధికారులు మాత్రం రూ.6,500 వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే సరైన సమాధానం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని జనం కోరుతున్నారు.

అడ్డంకులను అధిగమించి.. సమస్యలపై నినదించి..!

అంగన్వాడీల పట్ల ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించింది. సమస్యలపై అడుగుతుంటే తట్టుకోలేక కలెక్టరేట్ వద్ద ధర్నాకు వెళ్లనీయకుండా అడ్డంకులు సృష్టించింది. బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను మోహరించి అంగన్వాడీలను ఎక్కడికక్కడ అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఇదేమని ప్రశ్నించిన అంగన్వాడీలు, నేతలతో పోలీసులు వాగ్వివాదానికి దిగారు. అయితే పోలీసుల ఆంక్షలు, అడ్డంకులను అధిగమించి, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అంగన్వాడీలు వేలాదిగా కలెక్టరేట్ వద్దకు తరలొచ్చి ధర్నా విజయవంతం చేయడం విశేషం.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్

- అంగన్వాడీల ధర్నాకు అడుగడుగునా అడ్డంకులు
- బారికేడ్లు పెట్టి నిలువరించేందుకు యత్నించిన పోలీసులు
- సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్
- సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన సాగిస్తాం
- అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఝాన్సీ, కళ్యాణి
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి



ధర్నాకు వెళ్లనివ్వకుండా అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అయితే అంగన్వాడీలు ధర్నాకు వెళ్లనీయకుండా ఆంక్షలు పెట్టింది. కలెక్టరేట్‌కు వెళ్లే రెండు ప్రధాన మార్గాల్లో, అలాగే కలెక్టరేట్‌కు సమీపంలో మరో మూడు చోట్ల బారికేడ్లు పెట్టి పోలీసులను మోహరించింది. అంగన్వాడీలను కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై అంగన్వాడీలు, సిఐటియు నేతలతో పోలీసులు వాగ్వివాదానికి దిగారు. అయితే పోలీసుల నిర్బంధాన్ని ప్రతిఘటించి అంగన్వాడీలు ధర్నా ప్రాంతానికి పెద్దసంఖ్యలో చేరుకున్నారు. అక్కడ ముందస్తుగా వేసిన టెంట్ సరిపోకపోవడంతో మరో టెంట్ ఏర్పాటు చేస్తున్న నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అసలు ధర్నాకు అనుమతి లేదని, టెంట్ ఎలా ఏర్పాటు చేస్తారని పోలీసులు నేతలతో వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో సిఐ నాగరాజు అక్కడకు చేరుకుని సిఐటియు నేతలతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. ఒకపక్క వర్షం కురుస్తున్నప్పటికీ అంగన్వాడీలు ధర్నాకు తరలొచ్చి తమ సమస్యలపై గళమెత్తారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వాలు నిర్లక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అరకొర వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకోవడమే కాకుండా సంక్షేమ పథకాలకు అంగన్వాడీలను దూరం చేశారని విమర్శించారు. టిడిపి తన మేనిఫెస్టోలో చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిందని గుర్తు చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ పనిలోనూ అంగన్వాడీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్ఎస్ వంటి పనులు నిర్వహించడంలో నెట్ సౌకర్యం సరిగా లేక, సెల్‌ఫోన్లు పనిచేయక ఓటీపీలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసెంబ్లీ సాక్షిగా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని మంత్రి ఇచ్చిన హామీ సైతం నేటికీ అమలు కాలేదని గుర్తు చేశారు. జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి ధర్నా ప్రాంతానికి వచ్చి అంగన్వాడీలతో మాట్లాడారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. అంగన్వాడీ నేతలు శ్రీలక్ష్మికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం అంగన్వాడీ నేతలు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో ఎమ్‌డి.హసీనా, కె.తులసి, వై.రాణి, మహాలక్ష్మి, మార్తమ్మ, వసంత, పెద్దింట్లు, శ్రీదేవి, విజయలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మానవీయ కోణంలో అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం




వినతులు స్వీకరిస్తున్న జెసి

మానవీయ దృక్పథంతో పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలని, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జెసితోపాటు డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి ప్రజల నుంచి 274 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆడిటింగు చేస్తామని, ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని అన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని, అప్పుడే ప్రజలకు మనపై నమ్మకం కలుగుతుందని అన్నారు. అర్జీలు రీఓపెన్ అయితే వాటికి గల కారణాలను తప్పక విచారించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ జి.గీతభాయి, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత సీట్లు ఇవ్వని యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ వినతి

ప్రజాశక్తి - నరసాపురం



ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న నేతలు

పేద బలహీన వర్గాల కుటుంబాల పిల్లలకు ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 25 శాతం సీట్లు ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలన్న నిబంధనలు సక్రమంగా అమలు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న స్కూళ్ల యాజమాన్యాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ మేరకు ఆర్‌డిఒ దాసి రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవాధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్లలో విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఆయా స్కూళ్లలో సీట్లు పొందిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వకుండా మీ సీటు కేన్సిల్ అయిపోయిందని చెబుతూ అడ్మిషన్లు నిరాకరిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు బాధ్యత తీసుకుని ఏ స్కూల్‌కు ఎన్ని సీట్లు వచ్చాయో, ఎంతమంది విద్యార్థులను చేర్చుకున్నారు అనే విషయాలను వెలికితీసి అడ్మిషన్ ఇవ్వని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కొన్ని స్కూళ్లలో అడ్మిషన్ ఇచ్చి, ఫీజు కట్టాలంటూ తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన సీటుకు ఫీజులు ఎలా కడతారని ప్రశ్నించారు. జిఒ నెం.53, 54 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పుస్తకాల పేరుతో తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయడం తగదన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రభుత్వ నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు యు.నాగేంద్ర, బెల్లంకొండ కనకదుర్గ, సిహెచ్.రాజేష్, సందీప్, వై.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం తగదు

ఓడూరు పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరసన

కొనసాగిన పెనుమంట్ర ఎల్ఇ విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - పెనుమంట్ర



ఓడూరు విద్యార్థులు

మా పాఠశాల మాకు కావాలంటూ వారం రోజులుగా పెనుమంట్ర ఎల్ఇ పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఓడూరు యుపి పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓడూరు గ్రామంలోని యుపి పాఠశాలలో 6, 7, 8 తరగతులకు చెందిన 43 మంది విద్యార్థులను విలీనం పేరుతో పక్క గ్రామమైన నెలమూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు తరలించడం తగదన్నారు. ఓడూరు నుండి నెలమూరు హైస్కూల్ సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. ఇక్కడ నుంచి 43 మంది విద్యార్థుల తరలింపును రద్దు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ వై.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కుసుమ ప్రసాద్‌బాబు, దళిత విజ్ఞాన సేవా సంఘం అధ్యక్షులు కాటం హేమంత్‌కుమార్, నేతల సత్యానందం, మురకల వెంకటేశ్వరరావు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళనకు పార్టీల మద్దతు

మా స్కూల్ మాకు కావాలి అంటూ బ్యానర్ చేతపట్టి ఎల్ఇ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డెక్కారు. వారికి గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్,కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు, కుల వివక్ష వ్యతిరేక సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, వైసిపి నాయకులు కర్రి వేణుబాబు, తాడిపర్తి ప్రసన్న కుమార్ సంఘీభావం తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్ వై.రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.



పెనుమంట్ర ఎల్ఇ పాఠశాల విద్యార్థులు..

సర్పంచి విద్యాబోధన

విలీనం చేసినా మెయిన్ పాఠశాల దూరంగా ఉండడంతో అంతదూరం వెళ్లలేక, పాత పాఠశాలలోనే విద్యార్థులు ఉండిపోయారు. దీంతో ఆ గ్రామ సర్పంచి విద్యార్థులకు సోమవారం పాఠాలు బోధించారు. స్థానిక లూథరన్ చర్చి సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక (ఎల్ఇ) పాఠశాలలో 1, 2 తరగతులను మాత్రమే ఉంచి, మిగిలిన 3, 4, 5 తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులను ఊరి చెరువును అనుకొని ఉన్న మెయిన్ పాఠశాలలో విద్యా శాఖ విలీనం చేసిన సంగతి విధితమే. అయితే అక్కడకు వెళ్లకుండా విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయిని ఉన్నందున, తాను పాఠాలు చెబుతున్నానని పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. విలీనం సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు డిమాండ్ చేశారు. ఆయన సోమవారం స్కూల్‌ను సందర్శించి, వాస్తవ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఆక్వా కాలుష్యం నుంచి తాగునీటి చెరువులను కాపాడాలి

కలెక్టరేట్ వద్ద పెర్కిపాలెం మహిళలు ధర్నా

అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం



వినతి అందిస్తున్న పెర్కిపాలెం వాసులు, నేతలు

తమ గ్రామంలో ఆక్వా చెరువుల కాలుష్యం నుండి తాగునీటి చెరువులను కాపాడాలని పెర్కిపాలెం మహిళలు డిమాండ్ చేశారు. తాగునీటి చెరువును కలుషితం చేశారని, ఫలితంగా గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పెర్కిపాలెం మహిళలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ గ్రామంలో 2.5 ఎకరాల మంచినీటి చెరువు అనేక దశాబ్దాల నుండి ప్రజల దాహార్తి తీర్చుతుందన్నారు. మంచినీటి చెరువుకు వచ్చే పంట కాలువల పక్కనే ఆక్వా చెరువులు తవ్వారని, చేపల చెరువులుగా అనుమతులు తీసుకుని రొయ్యలు సాగు చేస్తున్నారన్నారు. ఫలితంగా ఉప్పునీటి కాసారంగా భూగర్భ జలాలు మారిపోయాయని, ఆక్వా చెరువుల్లోని కలుషిత జలాలు పంట కాలువలో కలిసి అది మంచినీటి చెరువులో కలుస్తుందని తెలిపారు. దీనితో తాగునీరు దుర్వాసన వస్తుందన్నారు. కనీసం వాడుకోవడానికి కూడా పని చేయడం లేదని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టాలని ఎన్ని వినతులిచ్చినా అధికారులు పెడచెవిన పెడుతున్నారన్నారు. అనంతరం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బొక్కా కూర్మారావు, బుడితి అలరాజు, కోరాశిఖ దుర్గమ్మ, తోట సుబ్బలక్ష్మి, తోట భవాని, దండుబోయిన దానమ్మ, బొర్రా పద్మావతి పాల్గొన్నారు.

హామీల అమలేదీ

వైసిపి ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం



కలెక్టరేట్ వద్ద వైసిపి శ్రేణుల ధర్నా

ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చిగురుపాటి సందీప్ విమర్శించారు. వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా విస్సాకోడేరు వంతెన నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, ఇంటికొక ఉద్యోగం అన్నారేగాని, ఇవ్వలేదని, ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు గాదిరాజు రామరాజు, కోడె యుగంధర్, బాలం శ్రీను, సునీల్ వర్మ, రాజశేఖర్‌రెడ్డి, మానుకొండ ప్రదీప్, సూర్య, రాహుల్, చందు, అభి, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెంకి అప్పారావు

పని గంటల పెంపుపై నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

కార్మికులపై ఒత్తిడి పెంచేలా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పని గంటల పెంపును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సిఐటియు మండల అధ్యక్షులు పెంకి అప్పారావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెంకి అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ వలీ, పంపన రమణ, నడిపూడి సత్యం, ప్రవీణ్, రమేష్, నిమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

పాలకోడేరు: జిల్లాలో అర్హతున్న ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పాలకోడేరులో సిపిఎం మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. బలరాం మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఏడాది గడిచినా హామీ అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వొచ్చని జిఒ ఉన్నప్పటికీ అది అమలు చేయడంలో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర అందించడంలో విఫలమైన ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ము అందించకపోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు పాలా వెంకటస్వామి, దున్న మరియమ్మ, వీరవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

సచివాలయ ఉద్యోగుల వినతి

నరసాపురం: బదిలీలు వెబ్ కౌన్సిలింగ్‌లో మాత్రమే పారదర్శకంగా నిర్వహించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజును సచివాలయ ఉద్యోగులు కలిసి సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందించారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు వారి సొంత మండలాల్లో పని చేసుకునే వెసులుబాటు కల్పించాలని, అంతర్ జిల్లా బదిలీలను చేపట్టాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, జాబ్‌ఛార్ట్ అమలు, ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన పొత్తూరి సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోసఫ్ కిషోర్, మదన్మోహన్, సిహెచ్.జయసుధ, బాలచంద్ర, సత్యానందన్, ఉదయ్‌కుమార్, నహీనా, ప్రసన్న, శ్రీనివాస్, గోపాలకృష్ణ, బి.కృష్ణ, శివకృష్ణ, వాసంతి, వై.రవికిషోర్ పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కాళ్ల పిహెచ్‌సి డాక్టర్ డి.సునీత



చిట్ - చాట్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డి.సునీత సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తికి ఆమె పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : రోజుకు పిహెచ్‌సిలో ఎంత ఒపి ఉంటుంది?

30 నుంచి 40 వరకూ ఒపి ఉంటుంది.

ప్రశ్న : ఏయే ప్రాంతాల నుంచి రోగులు వస్తారు?

దొడ్డనపూడి, కాళ్ల నుంచి జ్వరం కేసులు ఎక్కువగా వస్తుంటాయి. జ్వరాల తీవ్రత పెరిగినప్పుడు ఫస్ట్ ఎయిడ్ క్యాంపు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న : పిహెచ్‌సిలో మందుల కొరత ఉందా?

పిహెచ్‌సిలో మందుల కొరత లేదు. సబ్ సెంటర్ల పరిధిలోకి సరిపడే మందులు కూడా ఉన్నాయి.

ప్రశ్న : డెంగీ, మలేరియా కేసులు నమోదయ్యాయా? ఉంటే ఎన్ని కేసులు ఉన్నాయి?

డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదు. డెంగీ, మలేరియాకు ల్యాబ్ అసిస్టెంట్ ఇన్వెస్టిగేషన్ చేసి పాజిటివ్ ఉంటే నమోదు చేస్తాం.

ప్రశ్న : ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నారా?

ఫ్రైడే, డ్రైడేలో భాగంగా గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. ఇళ్ల వద్ద చెత్త నిల్వలు ఉండరాదని, పనికిరాని వస్తువులు, పాడైన వస్తువులు ఉంచరాదని, వీటివల్ల దోమలు అధికమై విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయని ప్రజలకు సూచించాం.

'నగదు బదిలీ' ఉపసంహరించుకోవాలి

జిల్లా పౌర సరఫరాల శాఖాధికారికి సిఐటియు వినతి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం రేషన్‌కు నగదు బదిలీ పథకాన్ని ఉపసంహరించుకుని గోడౌన్లలో పని చేస్తున్న కార్మికుల ఉపాధి కాపాడాలని సిఐటియు డిమాండ్ చేసింది. జిల్లా పౌరసరఫరాల గోడౌన్లలో కార్మికులకు ప్రతినెల బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరింది. స్థానిక కలెక్టరేట్ వద్ద నగదు బదిలీ పథకాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ పౌరసరఫరాల జిల్లా అధికారికి సిఐటియు బృందం సోమవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. జిల్లాలో ఆరు ఎంఎల్ఎస్ పాయింట్లలో 220 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. చేసిన పనికి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం రేషన్ స్థానంలో నగదు బదిలీ పథకం తీసుకురావాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సామంత్ర ఉదయ భాస్కరరావు, నాయకులు ఎం.చిన్నారావు, జి.ఆంజనేయులు, లక్ష్మణరావు, కె.కోదండం పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సికి 552 మంది హాజరు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా వ్యాప్తంగా మెగా డిఎస్‌సి పరీక్ష ఐదు కేంద్రాల్లో సోమవారం జరిగింది. ఉదయం సెషన్‌లో 101 మంది అభ్యర్థులకు గాను 92 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 573 మందికి గాను 460 మంది హాజరు కాగా 113 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 674 మంది అభ్యర్థులకు గాను 552 మంది హాజరు కాగా 122 మంది గైర్హాజరయ్యారు. 81.9 శాతం హాజరు నమోదైందని, ఏవిధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఇవిఐఎన్‌ఎస్‌ఎస్‌బిఎల్.నారాయణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 24వ తేదీన 33 కెవి వీరవాసరం, కొణితివాడ సబ్ స్టేషన్ పరిధిలో భీమవరం నుంచి వీరవాసరం వచ్చే లైన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ అప్పారావు సోమవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మండలంలోని వీరవాసరం, రాయకుదురు, తోలేరు, పంజా వేమవరం, నందమూరి గరువు, పెర్కిపాలెం, చింతలకోటిగరువు, కొణితివాడ, నవుడూరు, అండలూరు, మడుగు పోలవరం, నేలపోగుల, ఇండస్ట్రియల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మానవత సేవలు మరువలేనివి : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా పేద ప్రజలకు అందించే సేవల వల్ల లబ్ధిదారుల కళ్లల్లో కనిపించే ఆనందమే నిజమైన సంతృప్తి ఇస్తుందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు లయన్స్ కమ్యునిటీ హాల్లో ఆదివారం రాత్రి పాలకొల్లు మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభకు పూర్వ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడారు. పాలకొల్లులో మానవత అందిస్తున్న సేవలు లబ్ధిదారులకు అందడం ఆనందం ఇస్తుందన్నారు. పాలకొల్లు మండల నూతన అధ్యక్షులుగా బొక్క రమాకాంత్, కార్యదర్శిగా ముత్యాల శ్రీవాత్సవ, కోశాధికారిగా వారధి రమణారావు, సహాయ కార్యదర్శిగా ఇంటి శివరాం గోపాల్, ఉపాధ్యక్షుడిగా ధనాని సూర్య ప్రకాష్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కెవి.కృష్ణవర్మ గంగాధర్‌రావు, కొమ్ముల మురళీకృష్ణ, జక్కంపూడి కుమార్, ప్రతాప్‌రాజు, ముత్యాల రామారావు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు పడి కొడుకు మృతి

తండ్రికి గాయాలు - కాళ్లకూరులో విషాదఛాయలు

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - కాళ్ల

బైక్‌పై వెళ్తున్న తండ్రీ కొడుకుపై కొబ్బరి చెట్టు విరిగి పడడంతో కొడుకు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తండ్రి తీవ్ర పాలయ్యాడు. ఈ ఘటనతో కాళ్లకూరు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కాళ్లకూరుకు చెందిన తండ్రీ కొడుకు కట్టా రవి, కట్టా రామ్మోహనరావు ఇంటి వద్దే కొబ్బరికాయలు, చెరుకు రసం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి ఓ కొబ్బరి చెట్టు విరిగి బైక్‌పై వెళ్తున్న రామ్మోహనరావు, రవిపై పడింది. వాహనం నడుపుతున్న రవికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనం వెనుక కూర్చున్న రవి కుమారుడు రామ్మోహనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన రవి భీమవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రవికి ఇద్దరు కుమారులు. మృతి చెందిన రామ్మోహనరావు చిన్న కుమారుడు. వ్యాపారంలో తండ్రికి తోడుగా ఉండే రామ్మోహన్‌రావు మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బెల్టు షాపు నిర్వాహకుడిని అరెసు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ ఎస్ఐ మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది కలిసి సోమవారం మాధవరం గ్రామంలో దాడులు నిర్వహించారు. మేరకు బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 31 మద్యం సీసాలు, 10 బీర్ సీసాలను స్వాధనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందారని ఎస్ఐ కె.స్వామి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. కడలి నాగార్జున (36) వీరవాసరం మండలం నౌడూరు నుండి స్వగ్రామం పొలమూరు బండిపై వస్తుండగా ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతనిని స్థానికులు 108 వాహనంపై తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఆగస్టు 15న అన్నా క్యాంటీన్ ప్రారంభం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



అన్నా క్యాంటీన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉండి

ఆగస్టు 15న ఎట్టి పరిస్థితుల్లో అన్నా క్యాంటీన్ ప్రారంభమవుతుందని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. సోమవారం ఉండి ఇరిగేషన్ కార్యాలయ స్థలంలో అన్నా క్యాంటీన్‌కు రఘు రామకృష్ణరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణి బాబు, వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు మాట్లాడారు. కేవలం పురపాలక సంఘాల్లో మాత్రమే ఉండే అన్నా క్యాంటీన్‌ను గ్రామ పంచాయతీకి తీసుకొచ్చి గ్రామంలోని నిరుపేదలకు కేవలం ఐదు రూపాయలకే చౌక భోజనం అందించేందుకు రఘు రామకృష్ణరాజు చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఉండి నియోజకవర్గంలో తాత్కాలికంగా అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశారని కానీ నేడు శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు పునాదిరాయి వేయడం జరిగిందని తెలిపారు. సుమారు 61 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే అన్నా క్యాంటీన్ ఆగస్టు 15కు నిరుపేదలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఉపాధి హామీ నిధుల ద్వారా అన్నా క్యాంటీన్ ముందు భాగంలో సిసి రహదారిని త్వరలోనే నిర్మిస్తామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో బిసిల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలో బిసి హాస్టల్ నిర్మాణానికి ఉన్నతస్థాయి అధికారులతో ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వివిధ శాఖల అధికారులతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజవర్గ అభివృద్ధి శరవేగంగా జరగాలని, హైస్కూల్ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, ఇండోర్ స్టేడియం నిర్మాణంతో పాటు తాడేపల్లిగూడేనికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. విద్యాభివృద్ధికి నియోజకవర్గంలో ఎటువంటి జూనియర్ కళాశాల అందుబాటులో లేదని, జూనియర్ కాలేజీకి సంబంధించి స్థల సేకరణ చేయాలని, అలాగే బిసి హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మించే విధంగా స్థల సేకరణ చేయాలని ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్, తాడేపల్లిగూడెం తహశీల్దార్ సునీల్, పెంటపాడు తహశీల్దార్‌కు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖాతిబ్ కౌసర్ భానో, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు పురస్కారాలు

ప్రజాశక్తి - ఆకివీడు

పెదకాపవరం గ్రామానికి చెందిన రంగస్థల పద్య గాయకుడు, రంగస్థల నటుడు ఇద్దరికి సాహిత్య రత్న, అక్షరతేజం పురస్కారాలు అందించారు. కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాలలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 149వ జాతీయ ద్విశత కవి సమ్మేళనంలో గాదిరాజు చిన అప్పలరాజు, గాదిరాజు హేమ లక్ష్మీ నారాయణ రాజు పురస్కారాలు అందుకున్నారు. శ్రీశ్రీ కళా వేదిక ఛైర్మన్ శ్రీ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యకురాలు ఈశ్వరి భూషణం, టి.పార్థసారథి, చిట్టి లలిత, సుమశ్రీ వారిని సత్కరించారు.



దీక్షల్లో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

మున్సిపల్ సిబ్బంది రిలే దీక్షలు

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపాల్టీలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మెబాట పట్టారు. గత కొద్ది రోజులుగా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వివిధ రూపాల్లో నిరసన చేస్తూ వచ్చారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుంచి సమ్మెకు దిగారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేసి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం రిలే దీక్షలు చేపట్టారు. ఉద్యోగభద్రత, కనీస వేతనం రూ.29 వేలు, హెచ్‌ఆర్‌సి పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రత్నం, శ్యామ్, కాశీ, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, మధు, సుజాత, అను, జి.ప్రసాద్, వాసు పాల్గొన్నారు.

మహిళా పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ



మాట్లాడుతున్న పూర్ణ

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళా పథకాలను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అభయహస్తం పథకం పూర్తస్థాయిలో అమలు కావడం లేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో ఐద్వా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐద్వా పట్టణ అధ్యక్షురాలు సందక ఉదయ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో పూర్ణ పాల్గొని మాట్లాడారు. అనేకమంది మహిళలు ఈ పథకంలో సొమ్ము చెల్లించారన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు పెన్షన్, ఆ మహిళల పిల్లలకు స్కాలర్‌షిప్ ఇవ్వడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అవి నేటికీ సరిగ్గా అమలు జరగడం లేదన్నారు. శ్రీనిధి పేరుతో లక్షల రూపాయలు డిపాజిట్ల కింద సమృద్ధి పొదుపులు కట్టించుకున్నారన్నారు. 2018 నుండి శ్రీనిధి లోన్లు అనేక అవకతవకలు జరుగుతున్నాయని, వీటన్నింటినీ చక్కదిద్దాలని ఆమె సమావేశం పాల్గొన్న బ్యాంక్ అధికారులను కోరారు. అందుకు కారణమైన అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.ప్రసాద్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు సీసీ లోన్లు ఎందుకు తీసుకోవడం లేదని అన్నారు. స్పందించిన పలు గ్రూపుల మహిళలు గతంలో ప్రభుత్వం సున్నా వడ్డీలు ఇచ్చేదని ఇప్పుడు రెట్టింపు వడ్డీ కట్టాల్సి వస్తోందని తెలిపారు. సదస్సులో మహిళా సంఘం నాయకులు బి.పార్వతి, ఎర్ర కృష్ణవేణి, జివి లావణ్యరాణి, బి.కళ్యాణి, బి.కృష్ణవేణి, జ్యోతి, లావణ్య పాల్గొన్నారు.

మోడల్ ప్రయిమరీ స్కూళ్లను స్వాగతిస్తున్నాం

ఎంఎల్‌సి బొర్రా గోపి మూర్తి

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో మోడల్ ప్రయిమరీ స్కూళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేయడం స్వాగతిస్తున్నామని, అలాగే హైస్కూల్ ప్లస్ పాఠశాలలను కూడా ప్రభుత్వం బలోపేతం చేసి కొనసాగించాలని ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి మండలంలోని 11 హైస్కూళ్లలో సోమవారం కృతజ్ఞతగా పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డిఎ, పిఎఫ్ లోన్ త్వరతగతిన విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎకెవి.రామభద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజశేఖర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్షేమమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

90 శాతం కాలువల ప్రక్షాళన పూర్తి

ప్రజాశక్తి - ఉండి

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ఎంఎల్ఎ కనుమూరి రఘురామ కృష్ణరాజు ఆదేశాల మేరకు ఉండి డిసి పరిధిలో నిర్వహిస్తున్న కాలువల ప్రక్షాళన దాదాపు 90 శాతం పూర్తయిందని డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు అన్నారు. సోమవారం ఉండి గోరింతోట వద్ద మొండికోడు ప్రక్షాళన పనులను తోట ఫణిబాబు, మంతెన సాయిలచ్చిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని పంట, మురుగు కాలువల ప్రక్షాళన వేగవంతం చేశామని సార్వా సీజన్లో పంట ముంపునకు గురికాకుండా ఇప్పటినుంచే అన్ని చర్యలూ చేపట్టామని తెలిపారు. పంట కాలువల వెంబడి నివసించే ప్రజలు తమ ఇళ్ల వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని కాలువలో వేయకుండా పంచాయతీ బండికి అందజేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ గొట్టుముక్కల భాస్కరరాజు, రైతులు ఇందుకూరి గజపతిరాజు, ముదునూరి శ్రీనివాసరాజు, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ ఉన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో దొడ్డనపూడి వాసికి చోటు

కాళ్ల: దొడ్డనపూడి గ్రామానికి చెందిన విద్యా శ్రీవల్లి (4) ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది. శ్రీవల్లి 28 రాష్ట్రాల రాజధానులు, తెలుగు పదాలు అడిగిన వాటికి ఇంగ్లీషులో చెప్పినందుకు ఈ రికార్డు దక్కిందని తల్లిదండ్రులు శివ సత్యనారాయణ, నవ్యశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యా శ్రీవల్లిని దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు సోమవారం సత్కరించారు. విద్యా శ్రీవల్లి చెల్లి జస్విక శ్రీజ గతంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిందని గుర్తు చేశారు.

ఇరాన్‌పై అమెరికా దాడి దుర్మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఇరాన్‌పై అమెరికా దాడి అత్యంత దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నాలుగైదు రోజులుగా ఇరాన్‌పై అమెరికా అత్యంత దుర్మార్గంగా దాడి చేస్తోందన్నారు. ఒకపక్క ఇజ్రాయిల్, మరోపక్క అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయన్నారు. ఇటీవల అమెరికా పార్లమెంట్ సాక్షిగా ఇరాన్‌కు అణ్వాయుధాలు తయారు చేసే శక్తి లేదని, అణ్వాయుధాలు లేవని అమెరికా రక్షణాధికారులే చెప్పారన్నారు. అయితే అణ్వాయుధాల బూచితో ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయన్నారు. ఈ దాడులను ప్రజానీకం అంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నేతలు జె.సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు, మల్లిపూడి రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆధునిక యుగంలో విద్య ప్రగతి పథంలో ఉందని, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే మరింత రాణిస్తారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డిగ్రీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎంఎల్ఎ అభినందించారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఆదికవి నన్నయ యూనివర్శిటీ స్థాయిలో ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్స్ అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపల్ మావుళ్లు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు : ఎంఎల్ఎ

తణుకు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు, యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ భవిష్యత్తులో రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. తణుకు నియోజకవర్గంలో 148 ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి మౌళిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం తణుకు జాస్తి సీతామహాలక్ష్మీ బాలికల ఉన్నత పాఠశాలలో దమ్ములపాటి బ్రహ్మానందం జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు అందజేసిన ఆర్‌ఒ ప్లాంటును ఎంఎల్ఎ ప్రారంభించారు. విద్యార్థులకు విద్య మిత్ర కిట్లు, యూనిఫామ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్‌ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 73 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొయ్యేటిపాడులో 'పల్లె పల్లెకూ మన పితాని'

పెనుమంట్ర: దారిద్రరేఖకు దిగువనున్న పేదలను పి-4 సర్వే ద్వారా సంపన్నులను చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం కొయ్యేటిపాడులో పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. పేదవారికి ఉద్యోగ ఉపాధి ద్వారా ఆర్థిక స్తోమత కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. సర్పంచి కర్రి మునిరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి సత్తిసాయి ఆదినారాయణ రెడ్డి మాజీ ఎంపిటిసి ఈశ్వర్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు బామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌ఎం అడ్మిషన్ క్యాంపెయిన్

పాలకొల్లు : పాలకొల్లు ఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి అధ్యక్షతన అధ్యాపకుల సారథ్యంలో పాలకొల్లు పరిసర ప్రాంత విద్యార్థులకు అడ్మిషన్ల క్యాంపెయిన్ సోమవారం నిర్వహించారు. ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరితే ప్రభుత్వ పథకాలతో పాటు, కళాశాలలో అందించబడుతున్న కోర్సుల వివరాలు, దూర ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వంచే నడపబడుతున్న హాస్టల్ సౌకర్యాల గురించి వివరించారు. విద్యార్థునులకు టైలరింగ్ శిక్షణతో పాటు మగ్గం వర్క్, ఎంబ్రాయిడరీ వర్కులో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ గురించి వివరించారు. ప్రభుత్వ కళాశాలలో ఫీజులు చాలా తక్కువని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా అడ్మిషన్లు పొందొచ్చని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

'వెంటనే విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించండి'

ఉండి: మండల, జిల్లా స్థాయిలో నిర్వహించాల్సిన విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పెన్మెత్స వెంకట గోపాలకృష్ణంరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజిలెన్స్ కమిటీ సమావేశాలు మూడు నెలలకోసారి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ మండల జిల్లా స్థాయి అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకూ మండల స్థాయిలో గానీ జిల్లా స్థాయిలో గానీ విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించలేదని ఆయన వివరించారు. అధికారులు జాప్యం చేయకుండా విజిలెన్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మోసపోయిన వినియోగదారుడు

వినియోగదారుల సంఘం చొరవతో సొమ్ము వెనక్కి

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టు చీరలకు కేంద్రమైన కంచిలో 2000 రూపాయలు విలువైన రెండు చీరలను 16 వేల రూపాయలకు కొని మోసపోయిన వినియోగదారుడికి ఆ డబ్బులు వినియోగదారుల సంఘం ద్వారా వెనక్కి తెప్పించిన సంఘటన ఆకివీడులో చోటు చేసుకుంది. వినియోగదారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తెలిపిన వివరాల ప్రకారం. స్థానికంగా ఉండే డి.కృష్ణారెడ్డి గత నెలలో కంచిలో రూ.16 వేల విలువైన రెండు చీరలు కొన్నారు. ఆ చీరలు స్థానిక వ్యాపారాలు చూసి నాలుగు వేల రూపాయలు మించి విలువ చేయమని చెప్పారు. వెంటనే కృష్ణారెడ్డి వినియోగదారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులైన బొబ్బిలి బంగారయ్యను ఆశ్రయించారు. ఆయన వెంటనే కంచి బట్టల దుకాణదారునికి నోటీస్ పంపించారు. ఆ నోటీసుకు వారు చీరలు వెనక్కి పంపితే నగదు ఇస్తామని చెప్పారు. ఆ మేరకు బట్టల దుకాణదారునికి వినియోగదారుడు వాటిని పంపారు. చీరలు తీసుకున్న షాపు యజమాని ఎంత కాలానికీ స్పందించలేదు. ఈ నేపథ్యంలో మొత్తం వివరాలతో కలిపి బంగారయ్య రాష్ట్ర అధ్యక్ష హోదాలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు దుకాణదారుని మోసం వివరాలను ఉత్తరం ద్వారా తెలిపారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ వివరాలను కంచి పోలీస్ స్టేషన్‌కు పంపారు. ఎస్ఐ కేసు నమోదు చేస్తానని లేదా వెంటనే చెల్లింపు జరపాలని షాపు యజమానిని హెచ్చరించడంతో వెంటనే షాపు యజమాని వినియోగదారునికి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు బంగారయ్య వివరించారు.

మహిళా సర్పంచులకు శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సర్పంచులకు పంచాయతీ పరిపాలనపై పట్టు ఉంటే గ్రామాభివృద్ధి సులభమవుతుందని ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం, ఇరగవరం, అత్తిలి మండలాలకు చెందిన మహిళా సర్పంచులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ సర్పంచులకు పరిపాలనపై అవగాహన కల్పించారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. గణపవరం డిప్యూటీ ఎంపిడిఒ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్స్ విశ్వనాథం, కళ్యాణి, మహిళా సర్పంచులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ)లో 2025 - 2026 గాను అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఇనిస్టూట్ ప్రిన్సిపల్ ఐవి సత్యనారాయణ రాజు సోమవారం విలేకరులకు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎస్ఎస్‌సి మార్క్స్ మెమో, టిసి, ఆధార్ కార్డ్, స్టడీ, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో పాటు జతపర్చి స్వయంగా జులై 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ప్రభుత్వ ఐటిఐ ఆచంట కాలేజీలో అందజేయాలని కోరారు. అలాగే 21వ తేదీ సోమవారం కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని కాలేజీకి హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490111002కు సంప్రదించాలని కోరారు. కోర్సులు ఎలక్ట్రిషన్, ఫిట్టర్, ప్రిపరేషన్ అండ్ ఎయిర్ కండిషన్, మోటార్ మెకానిక్ డ్రాఫ్ మెన్ సివిల్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

నేడు రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - ఉండి

ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతులకు నిర్వహించే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటల నిర్వహణ చీడపీడల సమస్యల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆయిల్ పామ్, ఖరీఫ్ సంసిద్ధత వంటి అంశాల గురించి రైతులతో చర్చించనున్నట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని ఆయన తెలిపారు.

నేడు ఆచంటలో అన్నా క్యాంటీన్ పనులకు శంకుస్థాపన

ఎంపిడిఒ కృష్ణమోహన్

ప్రజాశక్తి - ఆచంట

ఈనెల 24వ తేదీ మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆచంట కచేరీ సెంటర్లో అన్నా క్యాంటీన్‌కు శంకుస్థాపన జరగనున్న ఎంపిడిఒ కృష్ణమోహన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. అనంతరం కరుగోరుమిల్లి గ్రామంలో 9 గంటల నుండి 11:00 గంటల వరకూ పల్లె పల్లెకూ మన పితాని కార్యక్రమంలో భాగంగా పంచాయతీ వద్ద మండల స్థాయి అధికారుల బృందం, ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు.

మీడియా రంగంలో మహిళలకు విస్తృత అవకాశాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మీడియా రంగంలో మహిళలకు అనేక అవకాశాలున్నాయని, విద్యార్థినులు బాగా చదివి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాశవాణి, దూరదర్శన్ పూర్వ అధిపతి గుత్తికొండ కొండలరావు చెప్పారు. పాలకొల్లు డిఎన్‌ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కళాశాలలో జర్నలిజం సర్టిఫికెట్ కోర్సుకు తన సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో వార్తల విభాగంలో తన అనుభవాలను విద్యార్థినులతో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

Change of Name

I, KURAPATI DHARMA SWAMY, S/o K.SHOBANADRA RAO, R/o D.No 2 - 41/1,OPP VETARNITY HOSPITAL, PEDAVEGI, WEST GODAVARI DT A.P- 534475,. have changed my name KURAPATI DHARMASWAMY to KURAPATI DHARAMA SOMALINGESWARA RAO, same as intimated to General Public.

CHANGE OF NAME

I, **SEERNAM VENKATA SATYANARAYANA REDDY** (Old Name), S/o. **SEERNAM RANGAREDDY**, Resident of Door No: 2-47, Chatrai Village, Chatrai Mandal, Eluru District. I have changed my name from **SEERNAM VENKATA SATYANARAYANA REDDY** (Old Name) to **SEERNAM NAGA VENKATA SATYANARAYANA REDDY** (New Name). Hereafter my name is known as **SEERNAM NAGA VENKATA SATYANARAYANA REDDY** (New Name) for all purposes.

CHANGE OF NAME

I, MANYAM POSAMMA (OLD NAME), W/O. RAMA KRISHNA, resident of, H.No.4-24, S.Illindalaparru, Penumantra (M), E.G.Dt. is announcing that my name was changed after marriage as **MANEM VIJAYA LAKSHMI** (NEW NAME), W/O RAMA KRISHNA. AS PER MY AADHAR CARD, barred NO.218784989911. from today onwards all my transactions were made by my new name **MANEM VIJAYA LAKSHMI.**